కూరగాయల ధరల

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.22, వంకాయ రూ.25, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.32, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.41, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.23, మునగ రూ.45, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

మినీ ట్యాంక్‌బండ్ సందర్శించిన కలెక్టర్



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చైతన్యపురి: రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌ను సందర్శించి నిమజ్జన ఏర్పాట్లపై ఆరా తీశారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్డీఓ రాజేశ్వర్‌రెడ్డి, డీసీపీ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

క్రీడాకారులకు సన్మానం



మన్సూరాబాద్: ఈ నెల 5వ తేదీ నుంచి గ్వాలియర్‌లో జరిగే 9వ జాతీయ వీల్‌చైర్ బాస్కట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన తెలంగాణ జట్టు క్రీడాకారులను బుధవారం బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగవైకల్యాన్ని లెక్క చేయకుండా ధైర్యంతో క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. జట్టు సభ్యులకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జట్టు కెప్టెన్ రమావత్ కోటేశ్వరనాయక్, సభ్యులు దరావత్ సురేష్, శివయాదవ్, గుండ్యానాయక్, శివానాయక్, శంకర్‌బాబు, బన్నీ, రాహుల్, రామకృష్ణ, రవి, నరేష్, పాండు, నితిన్‌ను సన్మానించారు.

నియామకం



సుమా భార్గవ

చైతన్యపురి: ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ తెలంగాణ బోర్డు మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ కాలనీకి చెందిన సుమా భార్గవ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరగకుండా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదన్నారు.

పోలీసులకు సహకరించాలి

మలక్‌పేట: గణేష్ నిమజ్జనం సజావుగా కొనసాగడానికి గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మలక్‌పేట, చాదర్‌ఘాట్, డబీర్‌పుర పోలీస్‌స్టేషన్ పరిధిలో 465 విగ్రహాలు ఉన్నాయని, స్థానిక పోలీసులతో పాటు 239 అదనపు పోలీసు సిబ్బంది, సున్నితమైన ప్రాంతాల్లో 10 పోలీస్ పికిటింగ్‌లు, 10 పుషింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 ఫీట్లు వెడల్పు, ఎత్తు 12 ఫీట్ల పైన ఉన్న గణపతులు ట్యాంక్ బండ్‌కు వెళ్లేందుకు చాదర్‌ఘాట్ రైల్వే అండర్ బ్రిడ్జి కింది నుంచి ప్రవేశం లేదన్నారు. భారీ విగ్రహాలను మూసారంబాగ్ చౌరస్తా నుంచి అంబర్‌పేట మీదుగా ట్యాంక్‌బాండ్‌కు వెళ్లాలని సూచించారు.

'కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి'

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి ఘర్షణలు జరిగే విధంగా కుట్రలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు.



నాగోలు: శ్రీసాయినగర్ కాలనీలో గణేష్ పూజలో పాల్గొన్న సిద్ధి వినాయక యువజన సంఘం నాయకులు



కొత్తపేట్: గణేష్ పూజలో పాల్గొన్న లింగాల రాహుల్‌గౌడ్, బొగ్గారపు శరత్ చంద్ర



సలీంనగర్: సీపీ సీవీ ఆనంద్‌ను సన్మానిస్తున్న అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి



శాలివాహననగర్ జైగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సిద్ధి వినాయక.. అభయప్రదాయక

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజవర్గాల్లో గణపతి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని మండపాల్లోని గణపయ్యలకు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గణపయ్యలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మికత ఉట్టి పడుతోంది.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



దిల్‌సుఖ్‌నగర్: పూజల్లో పాల్గొన్న సామ తిరుమల్‌రెడ్డి, మల్లారెడ్డి



వనస్థలిపురం: గణపతి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



వివేకానందనగర్: గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సామ రంగారెడ్డి



వాసవి కాలనీ:గణపతి పూజలో పాల్గొన్న ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్



వేంకటేశ్వర కాలనీ రోడ్ నంబర్- 2లో..



సాయినగర్ కాలనీ రోడ్డు నంబర్-1 సాయినిలయం అపార్ట్‌మెంట్‌లో కుంకుమ పూజలు



ఆర్‌కేపురం: టెలిఫోన్ కాలనీలో పూజలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి



చంపాపేట: గణనాథునికి ప్రత్యేక పూజలు చేసిన రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి



సైదాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డికి భగవద్గీత బహూకరిస్తున్న మండప నిర్వాహకులు



సైదాబాద్ మండపంలో పూజల్లో పాల్గొన్న బద్దం సమరసింహారెడ్డి

ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో సత్తా



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

చైతన్యపురి: ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన ఏఎంటీఐ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో చైతన్యపురిలోని చైతన్య హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రైమరి లెవెల్‌లో ఆరవ తరగతి విద్యార్థి చందు, సబ్ జూనియర్ లెవెల్‌లో ఏడవ తరగతి విద్యార్థి మోహిత్‌రెడ్డి, ఎనిమిదో తరగతి విద్యార్థి సాత్విక్ యాదవ్, జూనియర్ విభాగంలో పదవ తరగతి విద్యార్థులు నవదీప్, నీతు ప్రణతి, జైప్రకాష్ ప్రతిభ చాటారన్నారు.

'ఓనస్'లో అరుదైన శస్త్రచికిత్స

సైదాబాద్: ఓనస్ రోబోటిక్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. బుధవారం చంపాపేటలోని హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ బాలరాజు నాయుడు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన గోపమ్మ (58) తీవ్రమైన ఎడమ కాలి వాపుతో హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షల అనంతరం ఆమె వ్యాధి ప్రాణాంతకమైన పల్మనరీ ఎంబోలిజం, పోస్ట్ థ్రాంబోటిక్ సిండ్రోమ్‌లకు దారి తీయవచ్చని వైద్యులు గుర్తించి అధునాతన పద్ధతులలో ఆమెకు ఎండోవాస్కులర్ విధానంలో శస్త్రచికిత్స చేశారు. ప్రసుత్తం గోపమ్మ పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేస్తున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బాలరాజు నాయుడు

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



మూసారంబాగ్ ఆండాళ్ నిలయం సర్వీస్ రోడ్డులో..

మలక్‌పేట: రహదారులపై ఉన్న మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు నిలయంగా నిలుస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి అధ్వానంగా మారుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆండాళ్ నిలయం వైపు వచ్చే సర్వీస్ రోడ్డులోని పలు మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కాంట్రాక్టర్ బీటీ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన తర్వాత ఆండాళ్ నిలయం నుంచి ఎస్బీఐ ఆఫీసర్స్ కాలనీ కమాన్ వరకు వేసిన మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా చేయకుండా వదిలేయడంతో గుంతలుగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త రేషన్.. సన్నబియ్యం

బడంగ్‌పేట్: పుష్కరకాలం రేషన్‌కార్డుకోసం ఎదురు చూసిన అర్హులకు ఎట్టకేలకు ప్రభుత్వం నూతనంగా ఆహార భద్రత కార్డులను అందజేసింది. దీంతో కొత్తగా రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులు.. హర్ష వ్యక్తం చేస్తూ సన్నబియ్యం తీసుకునేందుకు నిత్యవసరాల దుకాణాలకు బారులు తీరుతున్నారు.

మొత్తం కార్డులు 26,741...

బాలాపూర్ మండలంలో మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మన్సిపాలిటీలు బాలాపూర్ మండలం కిందకు వస్తాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా 7,651 కార్డులు మంజూరు చేసింది. ఇంతకు ముందు అంత్యోదయ, ఆహారభద్రత కార్డులు, కొత్తగా వచ్చిన కార్డులతో కలిపి మొత్తం 26,741 కార్డులు ఉన్నాయి. అదనంగా 93,908 యూనిట్లు పెరిగాయి. మరికొన్ని పెండింగ్‌లో, ఇంకొన్ని పలు కారణాల వలన నిలిచిపోయాయి.



కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ నహిబ్ (ఫైల్)

ఆయా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, దశల వారీగా అర్హులందరికీ అందజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అర్హులందరికీ..

కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి ఈ నెల నుంచి రేషన్‌ను పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యం పంపించాము. నేడో రేపో సరఫరా చేస్తాం. పెండింగ్ దరఖాస్తులను పరిశీలన చేసి, అందరికీ ఇస్తాం.

– ఇందిరాదేవి, తహసీల్దార్



కవిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఎల్‌బీనగర్: మొదటి నుంచి పార్టీ అభివృద్ధి, విజయం కోసం కృషి చేసిన హరీష్‌రావుపై అనుచిత వాఖ్యలు చేయడం దారుణమని బీఆర్‌ఎస్ యువజన విభాగం రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరం నరసింహారావు అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికి రోజూ దాదాపుగా 500 మంది తమ సమస్యల పరిష్కారానికి హరీష్‌రావు ఇంటికి వస్తారన్నారు. కాంగ్రెస్‌తో ఆమె కుమ్మక్కై వారిచ్చిన పేపర్‌నే సమావేశంలో మాట్లాడిందని ఆరోపించారు.ఈ సమావేశంలో నాగార్జునగౌడ్, శ్రీకాంత్, ఉపేందర్‌రావు, జనేందర్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

మలక్‌పేట 'కేర్'లో ఉచిత ఆర్థోపెడిక్, కార్డియాక్ కన్సల్టేషన్లు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఆస్పత్రి ప్రతినిధులు

చాదర్‌ఘాట్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు ప్రేరణగా మలక్‌పేట కేర్ హాస్పిటల్ సామాజిక సేవలో భాగంగా కొత్త ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి గురువారం ఉచిత ఆర్థోపెడిక్ కన్సల్టేషన్లు, ప్రతి శుక్రవారం ఉచిత కార్డియాలజీ కన్సల్టేషన్ అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు బుధవారం హాస్పిటల్ ప్రతినిధులు వాటికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఎడ్లా మాట్లాడుతూ.. సమాజానికి మెరుగైన వైద్యం అందిచాలన్న కట్టుబాటులో భాగంగా ఈ ఉచిత సేవలను నిరంతరం కొనసాగిస్తామన్నారు.

కుమారుడు సహా తల్లి అదృశ్యం



కుమారుడితో సావిత్రి

నాగోలు: కుమారుడితో పాటు తల్లి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారంలో ఉండే పత్లావత్ జైహిందర్, సావిత్రి(26) భార్యాభర్తలు. వీరికి కుమారుడు విక్రాంత్ (5) ఉన్నాడు. జైహింద్ ఆటో నడిపిస్తుండగా సావిత్రి కేటరింగ్ పని చేస్తోంది. ఈ నెల1న సావిత్రి కుమారుడు విక్రాంత్‌ను తీసుకుని బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో భర్త జైహింద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మా రిజర్వేషన్ల జోలికి రావొద్దు

● గిరిజన సంఘాల జాక్ నేతలు

మన్సూరాబాద్: బంజారా, లంబాడ, సుగాలీల రిజర్వేషన్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని గిరిజన సంఘాల జాక్ నేతలు హెచ్చరించారు. లంబాడీల రిజర్వేషన్లు తొలగించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌కు నిరసనగా బుధవారం ఎల్‌బీనగర్‌లోని బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వారి దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 1947లో దేశానికి స్వాతంత్య్రం వస్తే 1976లో బంజారా, లంబాడ, సుగాలీలలకు ఎస్టీ జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇరువురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జాక్ నేతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముడావత్ శ్రీనివాస్ నాయక్, రఘునాయక్, గాంధీనాయక్, సుధీర్‌నాయక్, భరత్‌నాయక్, పున్నిబాయి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నేతలు

పార్కులను అభివృద్ధి పరుస్తాం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని పార్కులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధి తిరుమలకాలనీలో అర్బన్‌బయో డైవర్సిటీ నిధులతో పార్కు అభివృద్ధి పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్‌ను స్థానికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, దీరజ్, రంగారావు, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరింగుల కృష్ణ, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి వినతి

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనిలోని పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైపురికాలనీలోని పార్క్ గేటు విరిగిపోవడంతో రాత్రి వేళలో కొందరు మద్యం తాగి సీసాలు పడేస్తున్నారని, చుట్టుపక్కల చెత్త వేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కు అభివృద్ధిపై దృష్టి సారించాలని వినతిలో కోరామన్నారు.



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ధర్నా

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నాగార్జునసాగర్ రహదారి సాగర్ కాంప్లెక్స్ కల్వర్టు, బీఎన్‌రెడ్డినగర్ జలమండలి కార్యాలయం వద్ద బుధవారం బీజేపీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాస్తారోకోతో నాగార్జునసాగర్ రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వచ్చి వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. సాగర్‌కాంప్లెక్స్ నుంచి హరిహరపురం కాలనీ వరకు అటవి ప్రాంత నుంచి జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు ఆగిపోవడంతో డ్రైనేజీ నీరు అటవి ప్రాంతంలో నిలిచి కాలనీ వాసులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో శ్రీనివాస్‌రెడ్డి, సామరంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎమ్మెల్యే సహకారంతో కాలనీ అభివృద్ధి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వైదేహినగర్ నార్త్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోగుల రాంబాబు అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ కోసం బుధవారం పనులు ప్రారంభించిన సందర్భంగా రాంబాబు ఎమ్మెల్యేకు కృజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు రాజేంధర్‌రెడ్డి, నాగరాజు, వేణుగోపాల్, చక్రధర్, వెంకటేశ్‌గౌడ్, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాలనీవాసులు